క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సంకట హర చతుర్థి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గణపతికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చన నిర్వహించారు. మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో గణపతి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామి వారికి అర్చనలు, విశేష అలంకరణ చేసి, గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను చేపట్టారు. స్వామి వారి అభిషేకాలు, అర్చనలో పలువురు ఉభయదాతలు, భక్తులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు ప్రత్యేక క్యూ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

స్మృతివనం పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేస్తున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని ఈ నెల 26వ తేదీ రాజ్యాంగ దినోత్సవం రోజున సీఎం వైఎస్ జగన్ ప్రారంభిస్తారని మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి తెలిపారు. స్మృతివనం నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. పర్యటనలో వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లాంఛనంగా పింఛన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో బుధవారం తెల్లవారు జాము నుంచే పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమయింది. 32వ డివిజన్‌లో వలంటీర్ కేఎల్‌వీ సురేఖ తెల్లవారుజామునే దివ్యాంగురాలు ఎస్.నూకమ్మ ఇంటి తలుపుతట్టి పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ పాల్గొన్నారు. 27వ డివిజన్ గులాబీతోటలో అనారోగ్యంతో ఉన్న షేక్ లక్ష్మికి వలంటీర్ కనకదుర్గ పింఛను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ కో ఆర్డినేటర్ కొండాయగుంట రాము పాల్గొన్నారు.

నేటి నుంచి 29వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ఉదయం 7 గంటలకు మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డు కొబ్బరితోట నుంచి ప్రారంభమవుతుందని 29 వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నగర పాలక సంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలను స్వయంగా తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తారన్నారు.

విజయ గణపతికి విశేష పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సంకట హరచతుర్థి పురస్కరించుకుని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన బుధవారం విజయ గణపతికి విశేష పూజలు జరిగాయి. స్వామివారికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

10న ఆయుర్వేద దినోత్సవం

పాయకాపురం(విజయవాడరూరల్): ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీన పాయకాపురం, రాజీవ్‌నగర్ లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అసిస్టెంటు డైరెక్టర్, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలియజేశారు. సంస్థలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు అక్టోబరు 10నుంచి నవంబరు 10వ తేదీ వరకు నెలరోజుల పాటు ఆయుర్వేద వైద్యం ప్రయోజనాలపై ప్రజలకు, విద్యార్థులకు వివిధ కార్యక్రమాల పట్ల అవగాహన కల్గిస్తున్నామన్నారు. ఆయుర్వేద దినోత్సవం-2023 అంశం ఆయుర్వేద ఫర్ వన్ హెల్త్, ప్రతి ఒక్కరికీ ఆయుర్వేదం అని నిర్ణయించారన్నారు. విలేకరుల సమావేశంలో సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సాక్షి' మ్యాథ్స్‌బీ పరీక్ష

- సాక్షి మీడియా ఆధ్వర్యంలో...
- నాలుగు కేటగిరిల్లో విద్యార్థులకు పరీక్షలు
- విద్యార్థుల నుంచి విశేష స్పందన
- విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని పలు స్కూళ్లలో నిర్వహణ



సత్యనారాయణపురంలో సెయింట్ జాన్స్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్ష ఉత్సాహంగా జరిగింది. ఈ పరీక్ష విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టింది. మ్యాథ్స్‌లో విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో సబ్జెక్ట్‌పై మక్కువ పెంచడానికి ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులను వారు చదువుతున్న తరగతిని బట్టి నాలుగు కేటగిరీలుగా విభజించి ఈ పరీక్షను నిర్వహించారు. పాఠశాల స్థాయిలో జరిగిన ఈ పరీక్షకు విజయవాడ నగరంలోని ప్రైవేట్ పాఠశాలలతో పాటు నగర పరిసర ప్రాంతాల్లో స్కూళ్లకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలో ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను ప్రదర్శించారు. లెక్కల సబ్జెక్ట్ అంటే తమకు 'లెక్క' లేదని నిరూపించారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి జిల్లా, రీజనల్, రాష్ట్ర స్థాయిలో పరీక్షను నిర్వహిస్తారు.

మ్యాథ్స్‌బీ పరీక్ష జరిగిన పాఠశాలలు

కానూరులోని కేసీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో-96 మంది, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో-387 మంది, భవానీపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో-108 మంది, బందరురోడ్డులో సెయింట్ జాన్స్ స్కూల్‌లో 53 మంది, మొగల్రాజపురంలోని వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో 99 మంది, కానూరులో షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 118 మంది, సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో 103 మంది, ఆగిరిపల్లిలోని హ్యాపీ వ్యాలీ స్కూల్‌లో 81 మంది, పోరంకిలోని సంవిధ విద్యాపీఠ్‌లో 38 మంది, 5వ నంబరు బస్సు రూట్‌లోని డాక్టర్ కేకే ఆర్ గౌతమ్ స్కూల్‌లో 107 మంది, గాయత్రి నగర్‌లోని నలంద విద్యానికేతన్‌లో-85 మంది, నలందా హైస్కూల్‌లో 14 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.



కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్‌లో

లెక్కలపై భయం తగ్గింది



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ బీ పరీక్షలో పాల్గొనడంతో లెక్కలపై ఉన్న భయం తగ్గింది. ఈ పరీక్షకు ప్రిపేర్ కావడానికి చాలా సాధన చేశాను. ఈ సాధనలో భాగంగా పరీక్షకు ఎలా ప్రిపేర్ అవ్వాలనే అంశంపై పట్టు సాధించాను.

–భవ్యశ్రీ, 6వ తరగతి, సెయింట్ జాన్స్ స్కూల్, సత్యనారాయణపురం

సబ్జెక్ట్‌పై పట్టు దొరికింది



లెక్కల సబ్జెక్ట్‌పై ఆసక్తి పెరిగింది. సులువుగా లెక్కలను ఏవిధంగా చేయవచ్చు అనే అంశంపై ఈ పరీక్ష ద్వారా అవగాహన వచ్చింది. లెక్కల సబ్జెక్ట్‌పై మరింత సాధన అవసరమని తెలిసింది. మ్యాథ్స్‌బీ పరీక్ష ద్వారా చాలా మెలకువలు తెలుసుకున్నాను.

–చిత్ర, వీపీ.సిద్ధార్థ స్కూల్, 3వ తరగతి, విజయవాడ

జగనన్నకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



ప్రజలతో మాట్లాడుతున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గుణదల(విజయవాడ తూర్పు): అభివృద్ధిలో సెంట్రల్ నియోజకవర్గాన్ని మేటిగా నిలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఒకటో డివిజన్ ఒకటో వార్డు సచివాలయం పరిధిలోని శివారు ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కార్పొరేటర్ ఉద్దండి సునీతతో కలిసి ఎమ్మెల్యే విష్ణు బుధవారం నిర్వహించారు. ఆ ప్రాంతంలోని 102 గృహాలను వారు సందర్శించారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాలను పట్టించుకోకుండా పూర్తి నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాతనే ఈ ప్రాంతాలకు కొత్త కళ వచ్చిందన్నారు. ప్రజలకు అన్ని మౌలిక వసతులను కల్పించే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ చిట్టచివరి గడప వరకు చేరిందని, శివారు ప్రాంతాల ప్రజలు ఈ వ్యవస్థను కీర్తించడమే ఇందుకు నిదర్శనమన్నారు.

ప్రభుత్వంపై బీజేపీ గోబెల్స్ ప్రచారం

రాష్ట్రంలోని బీజేపీ నాయకులు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతున్నారని ఎమ్మెల్యే విష్ణు మండిపడ్డారు. ముఖ్యంగా పురందేశ్వరి బీజేపీ పగ్గాలు చేపట్టాక రాష్ట్రంలో బీజేపీ బాబుకి 'బి' టీం లా మారిపోయిందని విమర్శించారు. బాబు హయాంలో రెచ్చిపోయిన ఇసుక మాఫియా గురించి పచ్చ పత్రికల్లోనే అనేక కథనాలు వెలువడిన విషయాన్ని గుర్తు చేశారు. ఒక్క ఇసుక ద్వారానే ఐదేళ్లలో టీడీపీ నాయకుల అక్రమార్జన రూ.12,500 కోట్లకు చేరిందన్నారు. ఇవన్నీ బీజేపీ నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్‌రెడ్డి, ఉద్దండి సురేష్, బండి వేణు, మండాది వెంకట్రావు, పావని, అనంతలక్ష్మి, నాగరాజు, చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గానగర్‌లో దుకాణాల తరలింపునకు రంగం సిద్ధం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేపథ్యంలో కనకదుర్గానగర్‌లోని దుకాణాల తరలింపునకు రంగం సిద్ధమైంది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అన్నదాన భవనం, లడ్డూ పోటు, క్యూ కాంప్లెక్స్‌తో పాటు మరి కొన్ని అభివృద్ధి పనులకు ఈ నెల మూడో వారంలో శంకుస్థాపన చేయనున్నారు. అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టేందుకు కనకదుర్గానగర్ చాలా కీలకంగా మారింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న దుకాణాలను ఖాళీ చేయించాలని దేవస్థానం నిర్ణయించింది. కనకదుర్గానగర్‌లోని దేవస్థానానికి చెందిన స్థలంలో రెండేళ్ల కిందట 24 షాపులను నిర్మించారు. మహామండపం 5వ అంతస్తులో ఉన్న దుకాణాలకు చెందిన వారితో పాటు మొత్తం 21 మందికి షాపులను కేటాయించింది. ఈ మేరకు షాపు యజమానులతో దేవస్థాన అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ప్రస్తుతం కనకదుర్గనగర్‌లో ఉన్న దుకాణాలను తొలగించినట్లయితే తమకు మరో చోట ప్రత్యామ్నాయం చూపాలని దుకాణదారులు కోరుతున్నారు. దీంతో ఆయా దుకాణాల యజమానులకు ఎక్కడ షాపులు కేటాయించాలనే దానిపై దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టత రావాల్సి ఉంది. త్వరలోనే షాపు యజమానులు, దేవస్థాన అధికారులతో సమావేశం నిర్వహించి, తగిన నిర్ణయం తీసుకుంటామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు అజరామరం అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సత్యనారాయణపురం ఆంధ్రరత్న పార్కు వద్ద బుధవారం జరిగిన ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ మహనీయుని త్యాగానికి గుర్తుగా రాష్ట్ర అవతరణ దినోత్సవం, పొట్టి శ్రీరాములు జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు శనగవరపు శ్రీనివాస్, కొల్లూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతోనే దేశంలోనే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పడిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని విస్మరించిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ఎంతో ఘనంగా అవతరణ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో...

బందరు లాకులు సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో సర్వోదయ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి మోతుకూరి గోళ్ల నారాయణ, వేమూరు బాబూరావు, రాంపిళ్ల జయప్రకాష్, నేమాని కామేశ్వరి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ ఆశయాల కోసం కృషి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ కమీషనరేట్‌లో సీపీ టీకే రాణా బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రం కోసం బలిదానం చేసుకున్న గొప్ప త్యాగమూర్తి అని కొనియాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, అటువంటి మహనీయున్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్‌బీ ఏడీసీపీ సీహెచ్ లక్ష్మీపతి, ఏసీపీ కేవీవీఎన్వీ ప్రసాద్, సీసీఆర్‌బీ ఏసీపీ వెంకటేశ్వరరావు, ఏఓ రంగారావు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీ టీకే రాణా



మాట్లాడుతున్న రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో..

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని బుధవారం విజయవాడ రైల్వే పోలీసులు ఘనంగా నిర్వహించారు. రైల్వే ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రైల్వే డీఎస్పీ నాగరాజు రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ యు.బంగారు రాజు, జీఆర్పీ సీఐ పి.శ్రీనివాస్, ప్రసాద్, సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. స్థానిక సీతారాంపురంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి పంచలోహ స్వర్ణ ప్రభ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, రామకృష్ణ, దాసం దుర్గారావు, భరద్వాజ్, కె.ఫణి కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



జగనన్న ఆర్యోగ సురక్ష కార్యక్రమంలో మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీపేటలోని 237వ వార్డు సచివాలయ పరిధిలో స్థానిక ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్ర ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. దీనిలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కూడుకున్న వైద్యసేవల్ని నేరుగా పేదవాడి గడప వద్దకు ఉచితంగా తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. సచివాలయం పరిధిలో 4541 కుటుంబాలు నివసిస్తుండగా, ఆరోగ్య సిబ్బంది 1606 గృహాలను సందర్శించి 605 మంది రోగులకు దీని ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు.

జగనన్న సురక్ష శిబిరాలక్కు విశేష స్పందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల్లో చక్కటి స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అరండల్‌పేట 25 డివిజన్ 94 వ వార్డు సచివాలయ పరిధిలోని ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు శిబిరాలను చక్కగా వినియోగించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతల, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం 61వ డివిజన్ వాంబే కాలనీ హెచ్ బ్లాక్, 62వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో జరిగిన జగనన్న ఆర్యోగ సురక్ష వైద్యశిబిరాల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి, అలంపూరు విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో నిపుణులైన వైద్యులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి మాట్లాడుతూ శిబిరాల్లో ఉచితంగా వైద్య సేవలందించి, మందులను కూడా పంపిణీ చేస్తున్నారన్నారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించిన వారికి మందులను అందచేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మడి వెంకట్రావు, ఆర్‌ఎస్ నాయుడు, ఎండీ రఫీ, అలంపూరు విజయ్, రామిరెడ్డి, వీరబాబు, వైద్యులు బాసిద్, రాజా పాల్గొన్నారు.

రోగులు సంతృప్తి చెందేలా సేవలందించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రోగులందరూ పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సేవలందించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపై వైద్య ఆరోగ్య సిబ్బందితో ఆంధ్రప్రభ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాలలో రోగులకు చేసిన టెస్టులు, నెట్ వర్క్ హాస్పిటల్ రెఫరల్స్, కంటి వెలుగు సర్జరీ సిఫారసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఆరోగ్యశ్రీ, జీజీహెచ్, తదితర వాటికి వైద్యులు చేసిన రెఫరల్స్ మీద దృష్టి సారించాలని, వారందరినీ ఏఎన్ఎంల ద్వారా మ్యాప్ చేయించాలని సూచించారు. చికిత్స అనంతరం వాడాల్సిన మందులను సరిపడా అందించాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. సమావేశంలో డీఎంహెచ్ఓ సుహాసిని, ఏసీ(ప్రాజెక్ట్స్) సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్(హెల్త్) రత్నావళి, జోనల్ కమిషనర్ మాల్యాద్రి, జేఏఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి ఇందుమతి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ సుమన్, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలకు సత్కారం



అవార్డు గ్రహీతలను సత్కరించిన విజయబాబు, కొమ్మినేని తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పవిత్రమైన వృత్తిని, ప్రవృత్తిని సమన్వయం చేసుకుంటూ సుదీర్ఘ కాలం జర్నలిస్టులుగా, రచనల్లో రాణించిన వారు వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకోవడం ఆనందించదగ్గ విషయమని రాష్ట్ర అధికార భాషా సంఘ కమిషన్ చైర్మన్ పి.విజయబాబు తెలిపారు. వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్న జర్నలిస్టులు, రచయితలను విజయవాడ మొగల్రాజపురంలోని సీఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు గోవిందరాజు చక్రధర్, మహమ్మద్ ఖదీర్ బాబు, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, టి.శివాజీ, కె.హనుమంతరెడ్డి, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిలను సత్కరించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ దశాబ్దాల కిందట నుంచి పాత్రికేయ వృత్తిలో, రచనా వ్యాసంగంలో ప్రతిష్ఠులైన వారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించి గౌరవించడం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిభకు పట్టం కట్టడం రాష్ట్ర ప్రభుత్వం గొప్పతనమన్నారు. సీఆర్. మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాల గంగాధర తిలక్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు వీవీఆర్ కృష్ణంరాజు, నిమ్మరాజు చలపతిరావు, పి.రామకృష్ణ, బడే ప్రభాకరరావు పాల్గొన్నారు.

14 నుంచి కార్తిక మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో ఈనెల 14వ తేదీ నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు గోపూజ, ప్రథమ అభిషేకంతో కార్తిక మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిరోజూ స్వామివారికి విశేషంగా నవగ్రహాలకు అభిషేకం, విశేష హారతులు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతాయన్నారు.ఈనెల 17వ తేదీ నాగుల చవితి సందర్భంగా నాగదోష నివారణ పూజలు, విశేష అభిషేకం జరుగుతుందన్నారు. 26వ తేదీ కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని లక్ష బిల్వార్చన, జ్వాలాతోరణం నిర్వహిస్తామన్నారు. వచ్చేనెల 11వ తేదీ మాసశివరాత్రి సందర్భంగా శాంతి కల్యాణం జరుగుతుందన్నారు. వచ్చేనెల 12వ తేదీ మంగళవారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం 7 గంటలకు మహాకర్పూర హారతితో కార్తిక మాసోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు ఈ ఉత్సవాలలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.

వైద్యాధికారి పోస్ట్‌కు నేడు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం ద్వారా రవాణాశాఖ రాష్ట్ర కార్యాలయంలో పని చేసేందుకు వైద్యాధికారి నియామకానికి గురువారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం తెలిపారు. పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. నెలకు రూ.50 వేల వేతనంతో నియమించే ఈ వైద్యుడి నియామకానికి ఇంటర్వ్యూకు వచ్చే వారు 10వ తరగతి, ఇంటర్మీడియోట్, ఎంబీబీఎస్, నివాస ధ్రువపత్రం నకలు కాపీలతో హాజరు కావాలని సూచించారు.